గోటితలంబ్రాలతో భద్రాద్రికి పాదయాత్ర

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం నుంచి గోటి తలంబ్రాలతో భద్రాచలానికి మహాపాదయాత్రగా భక్తులు ఆదివారం తరలివెళ్లారు. ఏటా జంగారెడ్డి గూడెం పరిసర ప్రాంతాలనుంచి భక్తులు గోటితో వలిచిన బియ్యంతో భద్రాచలం కోదండ రామాలయానికి వెళుతుంటారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం 130 మంది వివిధ గ్రామాలకు చెందిన ప్రజలతో 21వ మహాపాదయాత్ర నిర్వహించారు. మహాపాదయాత్రను చామర్తి శ్రీరాములు, తపన చౌదరి జెండా ఊపి శ్రీరామరథంను ప్రారంభించారు. పాదయాత్రలో గ్రామ మధ్యస్తంగా కొలువైయున్న శ్రీగంగానమ్మ అమ్మవారిని దర్శించారు. అశ్వారావుపేట రోడ్‌లో కదిలిన పాదయాత్ర భక్తులకు శ్రీవల్లి దేవసేన సహిత శ్రీసుబ్రహ్మణ్య స్వామి వారి ఆలయకమిటీ దద్దోజనం అందజేసి తమ సేవాభావం చాటారు. శ్రీరామ ఆధ్యాత్మిక సేవా సమితి అధ్యక్షులు ముళ్లపూడి వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో వేలాది భక్తులు ముందుగా శ్రీకోదండరామస్వామి వారికి ప్రత్యేకపూజలు నిర్వహించగా, ఏలూరు తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతా రామాంజనేయ (తపన) చౌదరి, వీరంపాలెం శ్రీబాలా త్రిపురసుందరీ పీఠం ఆధ్యాత్మిక సేవా ప్రతినిధి ఈమని శశికుమార్, శ్రీ నూకాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ(పండు), చామర్తి శ్రీరాములు, కేఎల్ఎస్ ధనకుమార్ తదితరులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ముళ్ళపూడి వీరవెంకట సత్యనారాయణ మాట్లాడుతూ తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు తపన చౌదరి పారా మెడికల్ వాహనాన్ని తపన నుంచి సమకూర్చినట్లు తెలిపారు. తపన చౌదరి మాట్లాడుతూ శ్రీరామ సేవలో తపన పాల్గొనగలిగే అవకాశం పొందటం శ్రీరామ కృపగా భావిస్తున్నామని అన్నారు. తపన నుంచి పారా మెడికల్ బృందం వాహనంతో సహా అందుబాటులో ఉంచామని, అవసరమైన మందులు, సేవలు వాహనంలో భక్తులకు అందుబాటులో ఉంటాయని, వైద్యసిబ్బంది భక్తులతో యాత్ర సంపూర్ణమయ్యేవరకూ వెన్నంటి ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ ఆధ్యాత్మిక సేవా సమితి కార్యవర్గం, ప్రముఖులు పాల్గొన్నారు.


భద్రాద్రికి గోటి తలంబ్రాలతో మహాపాదయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

లక్కవరంలో అన్నసమారాధన


అన్నసమారాధన నిర్వహించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : లక్కవరంలో శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆఖరి రోజు ఆదివారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు జెట్టి గురునాధరావు, ఎంపీపీ కొదమ జ్యోతి, సర్పంచ్ గెల్లా వెంకట రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు విజ్జు వెంకట స్వామి నాయుడు ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దల్లి నాగేశ్వరరావు, పసల వెంకట రాజు, పత్తి వీరాస్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పర్యటన

కొయ్యలగూడెం : పోలవరం ఎమ్మెల్యే, శాసన సభ పక్ష ఎస్టీ కమిటీ చైర్మన్ బాలరాజు సోమవారం కొయ్యలగూడెంలో నిర్వహించే కార్యక్రమాలలో పాల్గొననున్నట్లు ఎంపీడీవో కేఆర్ఎస్ కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం పది గంటలకు నిర్వహించే ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరవుతారని అన్నారు. ముందుగా దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో నూతనంగా నిర్మించిన శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొంటున్నట్లు తెలిపారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్లో పావని ఫిజియోథెరపీ సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు తెలిపారు. ప్రజాప్రతినిధులు పార్టీ శ్రేణులు హాజరు కావాల్సిందిగా కోరారు.

ముత్యాలమ్మ సన్నిధిలో...


వెంకటాపురం ముత్యాలమ్మను దర్శించిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

పోలవరం రూరల్ : మండలంలోని వెంకటాపురం గ్రామ సమీపంలో ఉన్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారిని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదివారం దర్శించుకున్నారు. ఉగాది అనంతరం అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. నూతనంగా నిర్మించిన వంట షెడ్డును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకట్ రెడ్డి, ఎంపీటీసీ వలవల వరలక్ష్మి ఎమ్మెల్యే కన్నబాబుకు స్వాగతం పలికారు.

టైలర్ల అసోసియేషన్ సమావేశం


ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు అయ్యేలా చేయాలని కోరుతున్న టైలర్లు

కొయ్యలగూడెం : స్థానిక టైలర్స్ అసోసియేషన్ భవనంలో రాష్ట్ర టైలర్ అసోసియేషన్ కార్యదర్శి ఈదుపల్లి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆప్కో ద్వారా విక్రయించే దుస్తుల తయారీని టైలర్ అసోసియేషన్ సభ్యులకి అప్పగిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని అన్నారు. ఇటీవల దీనిపై ఆప్కో సంస్థకు దరఖాస్తు చేసుకోగా ఉన్నతాధికారులు రెడీమేడ్ కార్పొరేట్ సంస్థలకు దుస్తుల తయారీ అప్పగించినట్లు తెలిపారన్నారు. దీనిపై ఎంపీ కోటగిరి, ఎమ్మెల్యే తెల్లం బాలరాజుతో సహా జిల్లా మంత్రులు స్పందించి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

శ్రీనివాసపురంలో తాగునీటి కుళాయిల ఏర్పాటు


తాగునీటి సౌకర్యాన్ని ప్రారంభించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని శ్రీనివాసపురం చెంచు కాలనీలో తాగునీటి కుళాయిలను సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ నిధులతో ట్యాంకు నిర్మాణాలు, మంచినీటి పైపులైన్ల ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించడంపై కాలనీ వాసులు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి మండవల్లి విరాళం


మండవల్లి విజయసారధి దంపతులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జంగారెడ్డిగూడెం : శ్రీ విజయదుర్గ అమ్మవారి ఆలయ అభివృద్ధికి వైఎస్సార్ సీపీ పామర్రు నియోజకవర్గ పరిశీలకులు మండవల్లి విజయసారధి, సుజాత దంపతులు ఆదివారం రూ. 50,116 విరాళం అందించారు. ముందుగా వారు కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణకు విరాళాన్ని అందించారు. తొలుత మండవల్లి దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాలు అనంతరం వేదాశీర్వాదం చేసి దుశ్శాలువాతో సత్కరించారు.

ఫిష్ ఆంధ్రాతో మత్స్యకారుల కుటుంబాల్లో వెలుగులు

కొయ్యలగూడెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆలోచన మేరకు ఫిష్ ఆంధ్రాతో మత్స్యకారుల కుటుంబాల్లో వెలుగులు నిండనున్నాయి అని సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి పేర్కొన్నారు. ప్రభుత్వం మత్స్య శాఖ ఆధ్వర్యంలో కొయ్యలగూడెంలోని కన్నాపురం రోడ్డులో ఉన్న సంత మార్కెట్ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న ఫిష్ ఆంధ్రా భవన నిర్మాణానికి ఆమె ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన పూజలు నిర్వహించారు. పేదల సంక్షేమమే పరమావధిగా భావించి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనీయులన్నారు. నాలుగు ఫిష్ ఆంధ్ర యూనిట్లను మంజూరు చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు సర్పంచ్, వార్డు సభ్యులు పేర్కొన్నారు. నెల రోజుల వ్యవధిలో షాపుల నిర్మాణం పూర్తి చేసి ఎమ్మెల్యే బాలరాజుచే ప్రారంభోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. మత్స్యశాఖ, పంచాయతీ నిధులు రూ.7.50 లక్షల ఖర్చుతో భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. మత్స్యకారులకు పంచాయతీ స్థలం కేటాయించినందుకు మత్స్యకార మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ అధ్యక్షులు మంతెన సోమరాజు మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యేల నిధులతో పోలవరం రోడ్లో డ్రెయినేజీ నిర్మించనున్నట్లు తెలిపారు. మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు మట్టా వనజా లక్ష్మి, ఎంపీటీసీ గంటా శ్రీనివాస్, స్పందన వార్డు సభ్యులు మలిశెట్టి కేసుబాబు, రాచూరి మదన్, ఏలేటి భాస్కర్, గొలిశెట్టి ప్రసాద్, సూది కొండల శివాజీ గణేష్, పూలపల్లి రవి, మండ లక్ష్మి నాగేశ్వరరావు, పూసల దివ్య రాజేష్, స్పందన అధ్యక్షులు బొలుసు నాగేశ్వరరావు, ఐవీ అప్పారావు, మత్స్యకారులు పాల్గొన్నారు.


ఫిష్ ఆంధ్రా భవన నిర్మాణానికి శంకుస్థాపన పూజలు చేస్తున్న ప్రజాప్రతినిధులు

చంద్రబాబు ఎప్పటికీ మాజీ ముఖ్యమంత్రే

జంగారెడ్డిగూడెం : ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా చంద్రబాబు నాయుడు ఎప్పటికీ శాశ్వత మాజీ ముఖ్యమంత్రిగానే ఉంటారని చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయాల్లో కొనడం, మోసం చేయడం, దగా చేయడం, కుట్రలు చేయడం చంద్రబాబుకు వెన్నతోపెట్టిన విద్య అన్నారు. గతంలో మామగారిని వెన్నుపోటు పొడిచి, మోసం చేసి పార్టీని లాక్కొన్నారని, రాష్ట్రం విడిపోయిన తరువాత తెలంగాణలో ఓటుకు నోటు కేసులో ఇరుక్కుని అర్థరాత్రి పారిపోయి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చారన్నారు. చంద్రబాబు నైతిక విలువలు లేని రాజకీయం చేస్తున్నారని, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానం పోటీల్లో ఆయన చూపిన కుత్రంతం తెలుస్తోందన్నారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ ఫోన్ ట్యాపింగ్ వంటివి చేసి చంద్రబాబు కుట్రను బహిర్గతం చేశారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అలాంటి చర్యలు లేవు కాబట్టి ఏపీలో ఇద్దరు ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి వారి జీవితాలను, రాజకీయ భవిష్యత్తును నాశనం చేశారన్నారు. అంతేకాకుండా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యాన్ని చేస్తూ, ఒక ఎమ్మెల్సీని గెలుచుకుని ఏదో సాధించినట్లు ఫీలవుతున్నారని విమర్శించారు. ఇటీవల సహచర వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ తనకు చంద్రబాబు ఆఫర్ ఇచ్చినట్లు చెప్పారని, ఇలా ఎంతమందికి ఆయన ఆఫర్ ఇచ్చారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో నిబద్ధత, నైతిక విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని, కాని చంద్రబాబుకు ఆ దమ్ము, ధైర్యం లేదన్నారు. ఇటువంటి కుట్రలు, కుతంత్రాలతో కూడిన రాజకీయం చేస్తే చంద్రబాబు ఎప్పటికి మాజీ ముఖ్యమంత్రిగానే మిగిలిపోతారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎలీజా

సీఎం జగన్‌ను కలిసిన నేతలు


సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు


లింగపాలెం మండల వైస్ ఎంపీపీ మట్టా సురేష్


సొంగా సందీప్

లింగపాలెం : వైఎస్సార్ ఆసరా పథకం 3వ విడత పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు దెందులూరు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని హెలిప్యాడ్ వద్ద శనివారం లింగపాలెం మండలానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నేతలు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు, లింగపాలెం మండల వైస్ ఎంపీపీ మట్టా సురేష్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ యువ నేత, మిత్రదీప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సొంగా సందీప్ సీఎంను మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీకోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి మంచి గుర్తింపు ఉంటుందని సీఎం అన్నట్లు వీరు తెలిపారు.

ఎంపీ దృష్టికి రైతుల సమస్యలు

జంగారెడ్డిగూడెం రూరల్ : వర్జీనియా పొగాకుకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, ఇటీవల సంభవించిన ఈదురు గాలుల వర్షానికి దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం ఇప్పించాలంటూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, పామర్రు నియోజకవర్గ పరిశీలకులు మండవల్లి సోంబాబు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి ఎంపీ, ఉభయ గోదావరి జిల్లాల కోఆర్డినేటర్ మిథున్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఎంపీ మిథున్ రెడ్డి కలిసి రైతుల సమస్యలను సోంబాబు, బాబ్జి వివరించారు. వర్జీనియా పొగాకు గత ఏడాది రూ.245 ధర పలికిందని, ప్రస్తుతం జరుగుతున్న వేలంలో రూ.210కు ధర పడుతుందన్నారు. ఈ ధర వల్ల రైతులు నష్టపోయే అవకాశం ఉందని, రూ.250 ధర వచ్చేలా చూడాలని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఇటీవల ఈదురుగాలులతో కూడి వర్షానికి పొగాకు, మొక్కజొన్న, నిమ్మ తోటలు నేలవాలి రైతులు నష్టపోయారని, వారికి పరిహారం అందేలా చూడాలని ఎంపీని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బీవీఆర్ చౌదరి, వైస్ ఎంపీపీ మధు, సర్పంచ్‌లు బుద్దాల రాజు, సూరవరపు రాంబాబు, పారేపల్లి నాగేంద్ర,, పార్టీ నాయకులు మల్నీడి బాబి, కనపర్తి రాజేష్, నేట్రు గణేష్, సింగదాసు రాంబాబు, మనికె సత్యనారాయణ, మల్లాబత్తుల కృష్ణ చైతన్య, ప్రగడ సోం ప్రకాష్, బుద్దాల అనిల్, బండారు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో ఆదివాసీలపై దాడులు

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): బీజేపీ పాలనలో దేశవ్యాప్తంగా ఆదివాసీలపై దాడులు ఎక్కువగా పెరిగాయని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర అన్నారు. జీలుగుమిల్లి మండలంలో ఆ సంఘ జిల్లా 7వ మహాసభలు అమరజీవి కొమరం భొజ్జి, సున్నం రాజయ్య ప్రాంగణంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆ సంఘ పతాకాన్ని జిల్లా ఉపాధ్యక్షులు తెల్లం దుర్గారావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సురేంద్ర మాట్లాడుతూ 9 ఏళ్ల బీజేపీ పాలనలో అన్ని రాష్ట్రాల్లో గిరిజనులపై దాడులు విస్తృతంగా చేస్తున్నారని విమర్శించారు. తినే తిండి, కట్టుకునే బట్ట, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలపై జోక్యం చేసుకుంటున్నారని అన్నారు. బోయ, వాల్మీకిలను గిరిజన జాబితాలో చేరుస్తూ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ ఈనెల 31న రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ బంద్ ప్రకటిస్తున్నట్లు కిల్లో సురేంద్ర తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తెల్లం రామకృష్ణ, ధర్ముల రమేష్, తెల్లం దుర్గారావు, చుంద్రు బుల్లెమ్మ, పోలోజు నాగేశ్వరరావు, బొరగం భూచంద్రం, కారం భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.


ఏపీ గిరిజన సంఘం జిల్లా మహా సభల సందర్భంగా జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మానవత ఆర్థిక సహాయం

పోలవరం రూరల్ : పడవ ప్రమాదంలో ఉపాధిని కోల్పోయిన గూటాలకు చెందిన మైలు పోసియ్యకు మానవత ఆధ్వర్యంలో ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందించారు. ఇటీవల గోదావరి నదిపై జరిగిన పడవ ప్రమాదం కారణంగా పోసియ్య ఉపాధిని కోల్పోయాడు. అతని వైద్య ఖర్చుల నిమిత్తం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తరపున రూ.5 వేలు, సంస్థ మండల జాయింట్ సెక్రటరీ పెమ్మాడి దుర్గాప్రసాద్ రూ.500, సంస్థ సభ్యులు అడదారి వెంకటేష్ రూ.500 కలిపి మొత్తంగా 6 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు, మండల ఉపాధ్యక్షులు అంకెం సురేష్, సంస్థ మండల జాయింట్ సెక్రటరీ పెమ్మాడి దుర్గాప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.


మైలు పోసియ్యకు సహాయాన్ని అందిస్తున్న మానవత సభ్యులు

కౌలు కార్డులు జారీ చేయాలి

చింతలపూడి : ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారు హక్కుల చట్టం 2019ని సవరించి భూ యజమాని ప్రమేయం లేకుండానే కౌలు గుర్తింపు కార్డులు జారీ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చింతలపూడి ఏరియా కౌలు రైతు సంఘం మహాసభ సీపీఐ కార్యాలయం వద్ద ఎస్‌కే కాలేషా అధ్యక్షతన నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 28న విజయవాడలో జరగనున్న కౌలురైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం కార్యదర్శి దంతా కృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, తోర్లపాటి బాబు, బోడ వజ్రం, కౌలు రైతులు పాల్గొన్నారు.

లయన్స్ సేవలు సమాజానికి ఆదర్శంగా నిలవాలి

చింతలపూడి : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలు సమాజానికి ఆదర్శంగా నిలవాలని లయన్స్ క్లబ్ ఎల్‌సీఐఎఫ్ ఏరియా లీడర్ అంబటి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఎర్రంపల్లి గోలి నితిన్‌రెడ్డి లయన్స్‌క్లబ్ సేవా కేంద్రంలో ఆదివారం లయన్స్ క్లబ్ రీజియన్ మీట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రీజియన్ చైర్‌పర్సన్ జంగా చెన్నకేశవరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ చింతలపూడి రీజియన్‌లో లయన్స్ క్లబ్‌ల ద్వారా అందిస్తున్న సేవలను అభినందించారు. ప్రపంచంలోనే సమాజ సేవలో లయన్స్ క్లబ్ ముందు వరుసలో ఉంటుందని అన్నారు. రీజియన్ చైర్మన్ చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ తమ రీజియన్లో మూడు జోన్లలో కలిపి మొత్తం 12 క్లబ్‌లు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నాయని చెప్పారు. ఈ క్లబ్‌ల ద్వారా విస్తృతంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రీజియన్ మీట్‌లో భాగంగా రూ.3 లక్షలతో మహిళలకు కుట్టు మెషీన్లు, విద్యార్థులకు సైకిళ్లు, జెడ్పీ హైస్కూల్‌కు బీరువాలు, కుర్చీలు, గ్లాసులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం అంబటి సుధాకర్‌రెడ్డిని రీజియన్ చైర్‌పర్సన్ జంగా చెన్నకేశవరెడ్డి దంపతులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డా వీకే పంకజాక్షన్, మొదటి వైస్ గవర్నర్ గట్టి మాణిక్యాలరావు, రెండో వైస్ గవర్నర్ కాకరాల వేణుబాబు, ఆర్గనైజింగ్ చైర్మన్ చిల్లపల్లి మోహన్‌రావు, చైర్మన్ గోలి చంద్రశేఖర్‌రెడ్డి, మాస్టర్ ఆఫ్ సెర్మనీ ఎ పవన్ కుమార్, మాజీ జిల్లా గవర్నర్‌లు మురళీమోహన్‌రావు, కొత్తపల్లి రవికుమార్, కోఆర్డినేటర్ డి సుబ్బారావు, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ వెంకటస్వామి, 13 క్లబ్‌ల చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.


చింతలపూడి లయన్స్ రీజియన్ మీట్‌లో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కోడి పందేల స్థావరంపై దాడి

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని గురవాయిగూడెం గ్రామ శివారులో కోడి పందేల స్థావరంపై ఆదివారం ఎస్సై దుర్గా మహేశ్వరరావు తన సిబ్బందితో దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో నలుగురిని అదుపులోకి తీసుకుని రూ. 3,770 నగదు, 10 ద్విచక్ర వాహనాలు, 2 కోళ్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

జూదరుల అరెస్ట్

జంగారెడ్డిగూడెం : స్థానిక ముత్రాసిపేటలో పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురిని అరెస్టు చేసి రూ.900 నగదు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు.

ఇరువర్గాల మధ్య కొట్లాటపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం రూరల్ : లక్కవరంలో పుంతల ముసమ్మ అమ్మవారి ఉగాది జాతరలో ఇరువర్గాల మధ్య తలెత్తిన ఘర్షణపై లక్కవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల ప్రకారం ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి తెలంగాణ రాష్ట్రం నుంచి నృత్య బృందంచే నృత్యాలు నిర్వహించారు. బయట నుంచి నృత్య బృందాన్ని తీసుకురావడంతో అధిక సంఖ్యలో యువకులు ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు వచ్చారు. ఈ కార్యక్రమం జరుగుతున్న సమయంలో లక్కవరానికి చెందిన ఇరు వర్గాల మధ్య వివాదం తలెత్తి కొట్లాటకు దారి తీసింది. తమపై దాడి చేసి కొట్టారంటూ ఒక వర్గానికి చెందిన జీరి జగదీశ్వరర రెడ్డి, అలాగే తమపై దాడికి పాల్పడి కొట్టారంటూ మరో వర్గానికి చెందిన నిమ్మ సుబ్బారెడ్డి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై దుర్గా మహేశ్వరరావు తెలిపారు. ఇరువర్గాలకు చెందిన 20 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

విద్యార్థులకు అవగాహన

జంగారెడ్డిగూడెం : గణితం జీవన విధాన శాస్త్రమని, పాజిటివ్ దృక్పథంతో ఎదుర్కొంటే విజయం తథ్యమని ఆంధ్రప్రదేశ్ మాథ్స్ ఫోరమ్ ఏలూరు జిల్లా గౌరవాధ్యక్షులు నర్రా రాంబాబు అన్నారు. జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలుర హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు గణిత ప్రశ్నాపత్రంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొని సులువైన విధానంలో మంచి మార్కులు సాధించడం , సమయం సద్వినియోగంపై వివరించారు. ఇన్‌ఛార్జి హెచ్‌ఎం చిలుకూరి సుధాకరరెడ్డి ఎస్.నాగేశ్వరరావు, మహమ్మద్ నబీ, ఘంటసాల గణపతి, ఐవీఎస్ఆర్‌కె ప్రసాద్, వీవీఎస్ లక్ష్మి పాల్గొన్నారు.

జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం


వేములపల్లి గ్రామంలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు

లింగపాలెం : వేములపల్లి గ్రామంలో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద డ్వాక్రా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. డ్వాక్రా మహిళలు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు క్రమం తప్పకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 3వ విడత రుణమాఫీ ఆసరా నిధులు విడుదల చేసి డ్వాక్రా మహిళలకు అండగా నిలబడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్లపూడి జాన్సి, డ్వాక్రా వీఓలు లీడర్లు నత్తా మరియమ్మ, సి మాణిక్యం మహిళలు పాల్గొన్నారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

జంగారెడ్డిగూడెం : కార్మిక కర్షక వ్యవసాయ కార్మిక సంఘాలు ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.రవి పిలుపునిచ్చారు. ఆదివారం జంగారెడ్డిగూడెంలో గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి బొడ్డు రాంబాబు, సీఐటీయూ నాయకులు పసల సూర్యారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


నవ్యను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం ప్రభుత్వ పాఠశాలలో 1978–1982 బ్యాచ్ ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరవేసుకుని పూర్వ విద్యార్థులు సందడి చేశారు. అనంతరం ఆనాటి తమ సహచర విద్యార్థి ఓలేటి శిరిషా శ్రీనివాస్ కుమార్తె నవ్య చౌదరి రోలర్ స్కేటింగ్ నేషనల్ స్థాయి హాకీ విభాగంలో పలు పతకాలను సాధించడంపై సంతోషం వ్యక్తం చేశారు. చిన్నారితో సహా తల్లిదండ్రులను అభినందించి సత్కరించారు. జీఎస్ఎల్ వైద్య కళాశాలలో ఇంటర్న్‌షిప్ చదువుతూ గత మూడు సీజన్లలో ఫార్వర్డ్ ప్లేయర్ స్థానంలో ఉన్న నవ్య చౌదరి స్వర్ణ, కాంస్య, రజిత పతకాలను సాధించడంపై ఆమెకు అభినందనలు తెలిపారు. అనంతరం ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలను పునఃనిర్మించడంతో గతంలో ఉన్న నాలుగు సింహాల జాతీయ చిహ్న స్థూపం తొలగించారని దాని స్థానంలో పూర్వ విద్యార్థుల సౌజన్యంతో నూతన స్థూపాన్ని నిర్మించాలని తీర్మానం చేసుకున్నారు.